క్లుప్తంగా

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

చీరాల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా గ్రామస్థాయి అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. శనివారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించారు. గ్రామ సచివాలయాల వారీగా వచ్చిన అర్జీలు, విచారించిన అర్జీలను పరిశీలించి సూచనలు అందించారు. ఎంపీడీవోతో పాటు ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ, సచివాలయాల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల బహూకరణ


బారికేడ్లను అందజేస్తున్న అమరావతి నూలుమిల్లు సిబ్బంది

మార్టూరు: జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం నివారణ కోసం దాతలు 10 ఇనుప బారికేడ్లను పోలీస్ స్టేషన్‌కు అందజేశారు. స్థానిక అమరావతి నూలు మిల్లు తరఫున మేనేజింగ్ డైరెక్టర్ కందిమళ్ల శ్రీనివాసరావు రూ.1 లక్ష విలువైన 10 ఐరన్ బారికేడ్లను సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్‌కు సిబ్బంది ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నూలుమిల్లు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇడుపులపాడులో నామట్టి నాదేశం


మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): నామట్టి–నాదేశం కార్యక్రమాన్ని మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల నందు నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. క్యాడెట్స్ దేశ స్వాతంత్ర్యం కోసం అమర వీరులైన స్వాతంత్ర్య సమరయోధులకు దేశ రక్షణ కోసం అమరులైన వీర సైనికులకు నివాళులర్పిస్తూ వారి జ్ఞాపకార్థం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడవర్తి పేరిరెడ్డి ప్రారంభించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ బండారు అనిల్‌కుమార్, పీఈటీ వసంత రఘుబాబా, నరసయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బల్లికురవ: మలేరియా రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్, భారతి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా శనివారం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. దోమకాటుకు గురైతే మలేరియా వ్యాధి సోకుతుందని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం సోకితే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాని వైద్యాధికారులు వివరించారు. ర్యాలీలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శేషగిరావు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దిగొచ్చిన టమోటా..


స్వర్ణలో కూరగాయల దుకాణంలో రాసులుగా పోసి అమ్మకాలు చేస్తున్న వ్యాపారులు

స్వర్ణ (కారంచేడు): గడచిన రెండు నెలలుగా మార్కెట్‌లలో పెద్దపెద్ద దుకాణాల్లోనే కనబడిన టమోటా నేడు ధరలు దిగొచ్చి గ్రామాల్లోని చిన్న, చిన్న దుకాణాల్లోను రాసులుగా పోసి అమ్మకాలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల టమోటా దిగుబడులు తగ్గిపోవడంతో టమోటా మంచి గిరాకీ వచ్చింది. శనివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో చిన్న కూరగాయల దుకాణంలో టమోటాలు సుమారు 200 కేజీలకు పైగా రాసులు పోసి కేవలం రూ. 60లకే అని బోర్డులు పెట్టి అమ్ముతున్నారు. వారం క్రితం వరకు టమోటాలు రూ.250ల వరకు అమ్మకాలు జరిగాయని, ప్రస్తుతం టమోటాల ధరలు తగ్గాయని దుకాణదారులు చెబుతున్నారు. రూ 60 బోర్డులు పెట్టినా టమోటా కొనుగోలుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. రాసులుగా పోసిన టమోటాలను చూడటానికి, ఫొటోలు దిగడానికి మాత్రం వస్తున్నారని వారు తెలిపారు.

స్మార్ట్‌గా తప్పించుకుంటున్నారు

- ఈ–చలానా తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారుల ఎత్తులు
- నంబర్లు కనిపించకుండా అభిమాన నాయకుల బొమ్మలు
- ఇప్పటి వరకు 6 వేల ఈ–చలాన్ల పెండింగ్‌లు, పదికి పైగా వాహనాల సీజ్

వేటపాలెం: ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులు వాడిన వాహనాలే విచారణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ద్విచక్రవాహనం అంకెలు ఉండాల్సిన చోట కొందరు తమ అభిమాన నాయకుడి చిత్రాలు, తాను పనిచేస్తున్న హోదా పేర్లు వేయించుకుంటుండటం చేస్తున్నారు. చీరాల నియోజకవర్గ చీరాల టౌన్, రూరల్, వేటపాలెం మండలాల పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఉంచి ట్రాఫిక్ ఉల్లంఘనల వాహనాల అంకెలను సెల్‌ఫోన్‌లో బంధిస్తుంటారు. ఆ సమయంలో నంబర్ ప్లేట్లపై కొన్నింటికి అంకెలు లేకపోవడంతో చేసేదేమీ లేక వీధుల్లో ఉన్న సిబ్బంది మిన్నకుండి పోతున్నారు. ఈ–చలానాలు తప్పించుకొనేందుకు వాహన దారులు కొత్త ఎత్తులు వేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రవాణా చట్టం ప్రకారం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు మార్పు చేస్తే చర్యలు తప్పవని రవాణా, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ–చలానాలు వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 6 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. లౌడ్ సైలెన్సర్లు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు 10 వరకు సీజ్ చేశారు.


నెంబరు స్థానంలో పోలీస్ పేరుతో ఉన్న బుల్లెట్


నెంబర్ ప్లేట్ లేని వాహనం


పోలీస్ పేరుతో ఉన్న స్కూటీ

నిబంధనలు ఇవి..

రవాణా శాఖ సూచించిన హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. వెనుక రెండు వరుసల్లో సంఖ్య వేయాలి. వాహనం ముందు భాగంలో నంబర్ ప్లేట్‌పై అక్షరాలు 30 మిల్లీ మీటర్ల ఎత్తులో, అంకెలు 35 మిల్లీ మీటర్ల ఎత్తులో 7 మిల్లీ మీటర్ దూరంలో ఉండాలి. వెనుక బోర్డుపై అక్షరాలు 30 మిల్లీ మీటర్ ఎత్తులో అంకెలు 40 మి.మీ ఎత్తు అంకెల మధ్య 5 మిల్లీమీటర్ల దూరం ఉండాలి. వాహనం సామర్థ్యాన్ని బట్టి నంబర్ ప్లేట్ల కొలతలుంటాయి. వ్యక్తిగత వాహనాలు నంబర్ ప్లేట్లు పూర్తిగా తెలుపు రంగులో, అక్షరాలు నలుపు రంగులో ఉండాలి. రవాణా వాహనాలు (ట్రాన్స్‌పోర్టు) అద్దె ప్రాతిపదికన నడిచే వాహనాలకు నంబర్ ప్లేట్లు పూర్తిగా పసుపు రంగులో ఉండి నలుపు అక్షరాలు ఉండాలి.

ఉల్లంఘనలు ఇలా..

నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు మారుస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోంది. కనిపించని పరిమాణంలో అక్షరాలు రాయించుకుని మిగిలిన భాగంలో బొమ్మలతో రాసిఉన్న స్టిక్కర్లతో తిరిగే వాహనాలు సంఖ్య ఎక్కువవుతోంది. కొందరు అంకెల్లో ఏదో ఒకటి చెరిపేయడం. మరి కొందరు ఒకే అంకెను పెద్దగా రాయించుకుని వాహనాలు నడుతున్నారు. ఇక నంబర్ ప్లేట్ విరిగిపోతే తిరిగి చేసుకోవాలనే ధ్యాసే లేని వాహనదారులు కూడా చాలా మందే ఉన్నారు. వీరందరూ వాహన రిజిస్ట్రేషన్ సమయంలో మాత్రం రవాణా శాఖ అధికారులు సూచించే విధంగా హైసెక్యూరిటీ ప్లేట్లు తీసుకుంటున్నా, తరువాత తమకిష్టమైన విధంగా మార్చుకుంటున్నారు. కొత్తగా వాహనాలు కొన్నవారు తాత్కాలిక రిజిస్ట్రేషన్ టీఆర్ నంబర్‌తో వాహాన్ని నెలల తరబడి మరి కొందరు ఏళ్ల తరబడి తిప్పుతున్నారు. వాహనం కొన్న నెలరోజుల్లోనే శాశ్వత నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలనే నిబంధనలు గాలికొదిలేస్తున్నరు.

> **నిబంధనలు పాటించాలి..**
> రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఏవాహనానికైనా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు మాత్రమే బిగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మార్చినా, అంకెలు చెరిపేసినా జరిమానాలు తప్పవు. ఈ–చలానాల నుంచి తప్పించుకునేందుకు కొందరు నంబర్ ప్లేట్లను మారుస్తున్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా మీ పేర్లపై బదిలీ చేయించుకోవాలి. లేని పక్షంలో చిక్కుల్లో పడతారు.
> – జీ సురేష్, ఎస్సై వేటపాలెం

ప్రశాంతంగా ముగిసిన వార్డుల ఉపఎన్నిక


పోలింగ్ తీరును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి


శంకవరప్పాడులో ఎన్నిక పత్రం అందుకుంటున్న రాఘవరెడ్డి

- ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల హవా
- అద్దంకిలో శంఖవరప్పాడు, కాంచేడు స్వర్ణ వార్డుల్లో విజయం
- ఇంకొల్లులో పావులూరు సర్పంచ్ వైఎస్సార్ సీపీ కైవసం

స్వర్ణ (కారంచేడు): గతంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న 13వ వార్డులో గత సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏకగ్రీవంగా తన ఖాతాలో వేసుకుంది. అభ్యర్థి అకాల మరణంతో మరలా ఇక్కడ బై ఎలక్షన్ నిర్వహించాల్సి వచ్చింది. దీంతో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి మట్టే యోహాను (గౌను గుర్తు) 227 ఓటతో విజయంను సొంతం చేసుకున్నాడు. సమీప అభ్యర్థి జనసేన–టీడీపీలు బలపరిచిన కట్టా రాజేష్‌పై (ప్రెషర్ కుక్కర్) 179 ఓట్ల తేడాతో ఘన విజయంను సాధించాడు. ఎన్నికల అధికారి ఆర్ రమేష్‌బాబు వివరాల మేరకు ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఎన్నిక 9గంటల సమయానికి కేవలం 92 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 11 గంటలకు 218 ఓట్లు మధ్యాహ్నం 1 గంట సమయానికి 278 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో మట్టే యోహానుకు 227 ఓట్లు పోలవ్వగా, కట్టా రాజేష్‌కు 48 ఓట్లు, నోటాకు–2, చెల్లనివి–1 ఉన్నట్లు తెలిపారు. దీంతో మట్టే యోహానుకు అధికారులు గెలుపొందినట్లు సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, తహసీల్దారు ఎస్ వెంకటరత్నం, ఎన్నికల అధికారి రమేష్‌బాబు, పోలింగ్ ఆఫీసర్ ఎంపీ సత్యన్నారాయణ, ఏపీవో అంజయ్య, నోడల్ ఆఫీసర్ రామచంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు. కారంచేడు ఎస్సై శ్రీనివాసరావుతో 70 మంది పోలీస్ సిబ్బందితో అల్లర్లు జరగకుండా పర్యవేక్షించి, బందోబస్తు ఏర్పాటు చేశారు.

శంఖవరప్పాడు గ్రామంలో..

అద్దంకి: మండలంలోని శంఖవరప్పాడు గ్రామంలో 8 వార్డుకు నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి ఘన విజయం సాధించాడు. గ్రామ ఎనిమిదో వార్డుకు సంబంధించి మొత్తం 198 ఓట్లున్నాయి. ఇందులో శనివారం నిర్వహించిన ఎన్నికలో 157 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నోటాకు ఒక వోటు వచ్చింది. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి బైపీరెడ్డి రాఘవరెడ్డికి 108 ఓట్లు రాగా, టీడీపీ బలపరిచిన అభ్యర్థి శ్రీనివాసరెడ్డికి కేవలం 48 ఓట్లు రావడంతో 60 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారి బైపీరెడ్డి రాఘవరెడ్డికి ఎన్నికైనట్లు పత్రాన్ని అందజేరు. బందోబస్తును ఎస్సై ఆదిలక్ష్మి పర్యవేక్షించారు. పోలింగ్ సరళిని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో దేవసేన కుమారి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.


దేగరమూడిలో రజితకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అధికారులు

దేగరమూడిలో 6వ వార్డు ఏకగ్రీవం..

మార్టూరు: మండలంలోని దేగరమూడి గ్రామం 6వ వార్డుకు నిర్వహించిన ఉప ఎన్నికలో అధికార వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి కర్లపూడి రజిత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ధృవీకరించారు. ఉపఎన్నికల్లో రజిత మాత్రమే నామినేషన్ వేయటంతో పోటీ లేనందున ఆమె ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి కే బసవరాణి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండారు పల్లి లక్ష్మి, నాయకుడు జంపని వీరయ్య పాల్గొన్నారు.

499 ఓట్ల తేడాతో తన సమీప టీడీపీ అభ్యర్థిపై గెలుపు..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామ సర్పంచ్‌కు జరిగిన ఉప ఎన్నికలలో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి బొల్లెద్దు లుధియమ్మ 499 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పావులూరు గ్రామ సర్పంచ్ బొల్లెద్దు పరిశుద్ధరావు మృతి చెందడంతో పావులూరుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఉపఎన్నిక బరిలో పరిశద్ధరావు భార్య లుధియమ్మను పోటీలో ఉంచగా శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆమె గెలుపొందారు. పావులూరులో మొత్తం 3677 ఓట్లు ఉండగా శనివారం నాటి పోలింగ్‌లో 2282 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపరచిన లుధియమ్మకు 1288 ఓట్లు, టీడీపీ బలపరచిన అభ్యర్థి కొత్తపల్లి మహేష్‌బాబుకు 789 ఓట్లు, జనసేన అభ్యర్థి వలేరు ఎలీషాకు 111 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 42 ఓట్లు, చెల్లని ఓట్లు మరో 52 పోలయ్యాయి. ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ ఉప ఎన్నిక పోలింగ్‌కు భారీ బందోబస్తు నిర్వహించారు. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పలు వార్డు మెంబర్ల ఏకగ్రీవం


టీ. శ్రీనివాసరావు, కొరిశపాడు


పోలూరులో సర్టిఫికెట్ అందుకుంటున్న ఆదియ్య


సర్టిఫికెట్ అందుకుంటున్న వీరారెడ్డి

మేదరమెట్ల: మండల కేంద్రమైన కొరిశపాడు పంచాయతీ పరిధిలోని ఏడో వార్డు మెంబర్‌గా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి తొలుసూరి శ్రీనివాసులు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్డులో గతంలో ఉన్న వ్యక్తి మరణించడంతో ఇక్కడ ఎన్నికను ప్రకటించారు. దీంతో ఇక్కడ ఒక్క శ్రీనివాసులు మాత్రమే నామినేషన్ దాఖలుకావడంతో ఏకగ్రీవం అయ్యింది.

యద్దనపూడి: మండలంలోని రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన వార్డు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మున్నంగి వారిపాలెం 3వ వార్డుకు మనుబోతు వీరారెడ్డి, పోలూరులో 6 వ వార్డుకు ఆదియ్య నామినేషన్‌లు దాఖలు చేయగా వారికి పోటీగా నామినేషన్‌లు దాఖలు కాకపోవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం అయినట్ల ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు. శనివారం వారిరువురికి వార్డు సభ్యులుగా ఎంపికై నట్లు ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు.

గంగవరంలో నేత్రదానం


సత్యనారాయణ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గంగవరం గ్రామంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు కరి సత్యనారాయణ (80) శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అతని నేత్రాలను దానం చేశారు. కుటుంబ సభ్యులు భార్య నాగేంద్రమ్మ, కుమారుడు మల్లికార్జున, కుమార్తెలు విశాలక్ష్మి, హిమజకుమారిలు దాత కార్నియాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావులకు తెలియజేశారు. గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వరు, చుండి సాంబశివరావులు అభినందించారు.

మళ్లీ సీఎం జగనన్నే


బ్రోచర్‌ను అందజేసి సంక్షేమ పథకాలు వివరిస్తున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నే మరలా కాబోయే సీఎం అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం మండలంలోని శింగరకొండ పాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కం కోసం గడప గడపకు ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ, నెలనెల 1 తారీఖు తెల్లవారుజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేయటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలదగ్గరకు వెళ్లి సేవలందిస్తున్న వలంటీర్లను అవమానించే వ్యాఖ్యలు చేయటం దురదృష్టం కరమన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్ వై తిరుపతయ్య, స్థానిక నాయకులు కాకాని రాధకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నూతన సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండ పాలెం గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని శనివారం రాత్రి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఏర్పాటుతో గ్రామంలోని ప్రజలు అన్ని సమస్యలకు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశెన జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్ వై తిరుపతయ్య, గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభామూర్తులకు ఘన నివాళి


థెరిసా, గద్దర్, సినారే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం

అద్దంకి రూరల్: అద్దంకి ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో ప్రతిభావంతుల సభ నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతిభావంతులు మదర్ థెరిసా, గద్దర్, సీ నారాయణరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానపద కళాపీఠం అధ్యక్షుడు యు. దేవపాలన గద్దర్ స్మారకోపాన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు కొల్లా భువనేశ్వరీ మదర్ థెరిసా, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు సీ. నారాయణరెడ్డి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌కె మహ్మద్ రఫీ, పీసిహెచ్ కోటయ్య, ఆర్‌వీ రాఘవరావు, అద్దంకి లేవీ ప్రసాద్, జీ. దివాకరదత్తు, అన్నం త్రిమూర్తులు, టీ. నాగేశ్వరరావు, ఎస్‌కె ఆలేమస్తాన్, అద్దంకి పట్టణ సంగీత సాహిత్య సాంస్కృతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

అవార్డులతో మరింత పెరిగిన బాధ్యత


అవార్డులు అందుకున్న అధికారులను సత్కరిస్తున్న తహసీల్దార్

బల్లికురవ: విధినిర్వహణలో అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తూ అవార్డులు తీసుకున్న ప్రతిఒక్కరికీ బాధ్యతలు మరింత పెరుగుతాయని తహసీల్దార్ కే రవిబాబు అన్నారు. 77వ స్వాతంత్ర దిన వేడుకల్లో భాగంగా బాపట్ల ఇన్‌చార్జి మంత్రి కె.సత్యనారాయణ, కలెక్టర్ రంజిత్‌బాషా, చేతుల మీదుగా అవార్డులు అందుకున్న బల్లికురవ ఎఎస్‌వో ఆర్ అమర్‌నాథ్, మల్లాయపాలెం వీఆర్‌వో రత్నరాజు, ఎస్ఎల్ గుడిపాడు సర్వేయర్ షేక్ ఇమ్రాన్‌లను తహసీల్దార్ కార్యాలయంలో దుశ్శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలతోపాటు అందరి మన్ననలు పొంది ప్రసంశలు, అవార్డులు పొందవచ్చని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్ వీఆర్‌వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరుణించమ్మా.. పోలేరమ్మా !


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి

కారంచేడు: మండలంలోని స్వర్ణ అక్కదేవతల చెరువులో వెలసిన పోతురాజు–పోలేరమ్మల 11వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం నుంచి అమ్మవార్ల దేవాలయ ప్రాంగణంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు గ్రామంలో సుమారు 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

ఇంటింటా వైద్యంతో మరిన్ని సేవలు


వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలోని పేదలకు ఇంటింటా వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఉప్పమాగులూరు 2 సచివాలయం పరిధిలోని కోటవారిపాలెం గ్రామంలో 104 శిబిరంలో భాగంగా షుగరు, బీపి, హెచ్‌బీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం మంచాల్లో ఉన్న వృద్ధులను ఇంటింటికి వైద్య పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సాంకేతికతను వినియోగించాలి


మాట్లాడుతున్న జడ్జి శుభవాణి

పర్చూరు (చినగంజాం): సాంకేతికతను విద్యార్థులు దుర్వినియోగపరచకుండా అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం శుభవాణి అన్నారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌ను ఆమె శనివారం సందర్శించి పరిశీలించారు. ముందుగా హాస్టల్‌లోని సరుకులు, కూరగాయల స్టాక్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనారోగ్యం కలుగకుండా పరిసరాలను బ్లీచింగ్ వేయించాలని సూచించారు. తరువాత జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పిల్లలకు విద్యాహక్కు చట్టం, మైనర్ బాలికలకు వివాగం నిషేధం చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నిర్బంధ ఉచిత విద్య చట్టాల గురించి తెలియజేశారు. ప్రస్తుతమున్న సాంకేతికతను పిల్లలు తమ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని తెలియజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జీ అనంత లక్ష్మి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల భూములు దళితులకే దక్కాలి

బల్లికురవ: శతాబ్దాల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్‌మెంట్ డీకే భూములు అగ్రవర్ణాల ఆధీనంలోకి వెళ్లాయని.. దళితులకు తిరిగిదక్కేవరకు పోరాటం ఆగదని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం కుకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లో దళితులకు ఇచ్చిన భూములను ఆయన పరిశీలించారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖకు హక్కులు కల్పించాలని , లేకుంటే ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టీ వెంకటేశ్వర్లు, బడుగు రూపేష్ పాల్గొన్నారు.